Eenadu

Hyderabad - Jun 03, 2016

| | | | |
|---|---|---|---|
| Page No: | 12 | Type: | Newspaper |
| Page Name: | n.a. | Language: | Telugu |
| Size: | 386 sq. cm | Circulation: | 433,326 |
| AVE: | INR 440,333 | Frequency: | Daily |

Title: Take policy? Don't hide truth!

# పాలసీ తీసుకుంటున్నారా? నిజాల్ని దాచకండి!

**తనపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఆర్థికంగా ఏ ఇబ్బందీ రాకూడదు అనే లక్ష్యంతోనే జీవిత బీమా పాలసీలు తీసుకుంటారు. మరి, పాలసీ తీసుకునే సమయంలో అన్ని వివరాలూ చెబుతున్నారా? పాలసీ నిబంధనలు తెలియకపోవడం.. లేదా ఉద్దేశపూర్వకంగా కొంతమంది తమ ఆరోగ్య వివరాలను దాచిపెట్టి పాలసీ తీసుకుంటున్నారు. భవిష్యత్తులో పాలసీ క్లెయిం చేసుకోవాల్సి వచ్చినప్పుడు నామినీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.**






'మిస్టర్ ఏ' ఒక జీవిత బీమా పాలసీ తీసుకోవాలనుకున్నాడు. అతనికి భార్య, 10, 8 ఏళ్ల ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం అతనికి క్యాన్సర్ సోకింది. చికిత్స తీసుకున్నాడు. ఇప్పుడు ఏ ఇబ్బందీ లేదు. కానీ, జీవిత బీమా పాలసీ తీసుకునేప్పుడు ఈ విషయం దాచి పెట్టాడు. భవిష్యత్తులో ఏదైనా కారణంతో పాలసీని క్లెయిం చేసుకోవాల్సి వచ్చినప్పుడు బీమా కంపెనీ అతని గత వైద్య చరిత్రను ఆధారంగా చేసుకొని, పాలసీ క్లెయిం ఇవ్వడానికి తిరస్కరించొచ్చు. ఇది ఒక్క 'మిస్టర్ ఏ' విషయంలోనే కాదు.. కొత్తగా పాలసీ తీసుకోబోయే వారందరూ గుర్తు పెట్టుకోవాల్సిన విషయమే.

జీవిత బీమా అంటే.. బీమా తీసుకునే వ్యక్తికీ.. బీమా ఇచ్చే సంస్థకూ మధ్య కుదిరే ఒక నమ్మకమైన ఒప్పందం! పాలసీ తీసుకోవాలనుకున్నప్పుడు ఆ ప్రతిపాదన పత్రంలో అడిగిన ప్రతి ప్రశ్నకూ సమాధానాన్ని పాలసీదారుడు పూర్తిగా అర్థం చేసుకొని పూర్తి చేయాలి. ఒక వ్యక్తి ఆరోగ్య, ఆహార అలవాట్ల గురించి అతనికి మాత్రమే పూర్తి అవగాహన ఉంటుంది. కాబట్టి, బీమా సంస్థ ప్రతిపాదిత పత్రంలో అడిగిన ప్రతి ప్రశ్నకూ సరైన సమాధానం చెప్పగలవారు పాలసీదారుడు ఒక్కడే. ఒకవేళ ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇస్తే.. బీమా కంపెనీ తన పాలసీదారుడి గురించి పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం ఇవ్వనట్లే. ఇలాంటప్పుడు బీమా సంస్థ ఆ ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయడం లేదా.. పాలసీకి పరిహారం ఇవ్వకపోవడంలాంటివి చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తుంది.

పాలసీదారుడి వయసు, ఎంచుకున్న మొత్తం ఆధారంగా కొన్నిసార్లు బీమా సంస్థ వైద్య పరీక్షలు కోరవచ్చు. పాలసీ మొత్తం తక్కువగా ఉంటే కొన్నిసార్లు ఈ వైద్య పరీక్షల అవసరం పడకపోవచ్చు. ఇలాంటప్పుడు పాలసీదారుడు చెప్పిన సమాచారం ఆధారంగానే పాలసీని అందిస్తారు.

పాలసీ తీసుకునేప్పుడు ఈ నిజాలను దాస్తే ఏమవుతుంది? పాలసీపై ఎలాంటి ప్రభావం చూపుతుంది?

## ఉద్దేశపూర్వకంగా..

మోసపూరితంగా పాలసీ తీసుకోకుండా బీమా సంస్థ పలు చర్యలు తీసుకుంటుంది. ముందే అనుకున్నట్లు ఒక వ్యక్తి ఆహార, ఆరోగ్య అలవాట్ల గురించి అతనికి తెలిసినట్లు వేరొకరికి తెలియదు. పాలసీ తీసుకున్నప్పుడు ఈ నిజాల్ని వెల్లడించకపోతే.. కావాలనే దాచిపెట్టి పాలసీ తీసుకున్నట్లు భావిస్తుంది బీమా సంస్థ.

ఇతరులపై ప్రభావం.. జీవిత బీమా సంస్థలు పాలసీలకు ప్రీమియం నిర్ణయించేప్పుడు అదే వయసులో ఉన్నవారికి ఇచ్చిన పాలసీల చెల్లింపులను పరిగణనలోనికి తీసుకొంటాయి. పాలసీదారుడు తన ఆరోగ్యం గురించి పూర్తి వివరాలు వెల్లడించినప్పుడు లేదా వైద్య పరీక్షల్లో అతనికి సంబంధించిన అనారోగ్య వివరాలు తెలిసినప్పుడు బీమా సంస్థ కాస్త అధిక ప్రీమియాన్ని చెల్లించాల్సిందిగా కోరవచ్చు. ఒకవేళ వ్యక్తులు తమ ఆరోగ్య వివరాలను దాచిపెట్టి, పాలసీలు తీసుకున్నప్పుడు చెల్లింపులు అధికంగా ఉంటే.. బీమా సంస్థ ఆ వయసులో ఉన్నవారికి ప్రీమియాన్ని పెంచే ఆలోచన చేయవచ్చు. పరోక్షంగా ఇది ఆరోగ్యవంతులందరి మీదా ప్రభావం చూపించవచ్చు.

బీమా చట్టం.. బీమా ప్రతిపాదిత పత్రంలోనూ.. అనేక సందర్భాల్లో వివిధ కోర్టులు ఇచ్చిన తీర్పులనూ పరిశీలిస్తే.. పాలసీ తీసుకునేప్పుడు సరైన వివరాలు తెలియజేయాల్సిన అవసరం ఏమిటన్నది తెలుసుకోవచ్చు. ఒకవేళ పాలసీదారుడు ఆరోగ్య వివరాలను తెలియజేయని సందర్భాల్లో బీమా సంస్థ పాలసీ క్లెయింను నిరాకరించేందుకు అవకాశం ఉంది.

*- సునీల్ శర్మ, చీఫ్ రిస్క్ ఆఫీసర్, కొటక్ మహీంద్రా ఓల్డ్ మ్యూచువల్ లైఫ్ ఇన్సూరెన్స్*

## ఆపదలో ఆదుకోదు..

ఒక వ్యక్తి తనపై ఆధారపడిన వారిని ఆర్థికంగా ఆదుకుంటుందనే బీమా తీసుకుంటాడు. ఆ వ్యక్తి దూరం అయినప్పుడు బీమా సంస్థ ఇచ్చే పరిహారం ఆ కుటుంబానికి కొండంత అండను ఇస్తుంది. ఒకవేళ నిజాలు వెల్లడించకుండా పాలసీ తీసుకుంటే.. బీమా సంస్థ ఆ పాలసీకి క్లెయిం ఇవ్వడానికి తిరస్కరిస్తే.. ఏమిటి పరిస్థితి? ఆ వ్యక్తి అనుకున్న లక్ష్యం నెరవేరుతుందా? ఒక చిన్న అబద్ధంతో తన కుటుంబానికి ఆర్థిక అండను దూరం చేసినట్లే కదా! సరైన వివరాలు వెల్లడించని కారణంగా.. పాలసీ క్లెయిం పరిష్కారంలో ఆలస్యం కావచ్చు. కొన్నిసారు మొత్తానికే రాకపోవచ్చు.

- ప్రతిపాదిత పత్రాన్ని స్వయంగా పూర్తి చేసి, అన్ని వివరాలూ సరిగ్గా నింపిన వ్యక్తికి పాలసీ క్లెయింలో ఎలాంటి ఇబ్బందీ రాదనే చెప్పాలి. సరైన కారణం లేకుండా ఏ బీమా సంస్థ కూడా పాలసీ క్లెయిం ఇవ్వకుండా తిరస్కరించేందుకు వీల్లేదనేది ఇక్కడ మనం గమనించాల్సిన విషయం.

బీమా చేయడమే కాదు.. అది మనం అనుకున్న వారికి సక్రమంగా చేరేలా జాగ్రత్తలు తీసుకోవాల్సిందీ మనమే. కాబట్టి, పాలసీ తీసుకోబోయే ముందు నింపే ప్రతిపాదిత పత్రం తప్పుల్లేకుండా పూర్తి చేయండి. అప్పుడే మీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఆర్థిక అండ లభిస్తుంది!



© Eenadu

www.eenadu.net